# సాలె గూడు

కళ్ళు తెరచి నిద్రావస్థలోంచి బయటపడిన ఒక్క నిముషానికి గానీ రోహిణికి తన కొత్త జీవితం, కొత్త హొదా గుర్తుకు రాలేదు. నెల రోజులుగా తన దిన చర్యకీ, అంతకు మునుపు పన్నెండేళ్ళ పాటు తను గడుపుతున్న జీవితానికీ పోలికే లేదు. నిశ్చలంగా నిద్రపోతున్నాడు శ్రీహరి. అతనికి దగ్గరగా ఆనుకుని, బోర్లా పడుకునుంది శైలజ. రోహిణి బరువుగా వూపిరి వదిలింది. వీళ్ళిద్దరు తన వాళ్ళు! ఈ గూడూ, యీ నీడా, యీ సుఖం, సంపద అన్నీ తన స్వంతం. ఇవి యిక చేతుల్లోంచి జారిపోయే ప్రమాదం లేదు.

లేచి యింటి పనుల్లోపడింది రోహిణి. అంటే పైపైన సర్దుకుని అజమాయిషీ చేయడమే. పని కుర్రాడు, కారు డ్రైవరు, తోటకు నీళ్ళు పోసే ముసలి తాత... అందరికీ తనిప్పుడు యజమానురాలు. నాలుగు రోజులనాడే వంట మనిషిని మాన్పించేసింది. ఇదంతా తనదేనని ముప్ఫైరోజులుగా ఆపేక్ష పడిపోతున్నా... "నీవి కానేకాదు. మాయలో పడిపోకు" అని వ్రాస్తుంది మాలతి.

తన మట్టుకు కాఫీ తయారు చేసుకుని త్రాగి, ముందు వరండాలో వున్న ఉయ్యాల బల్లమీద కూచుంది. లోపల బీరువాలో వుంది మాలతి దగ్గర్నుంచి వచ్చిన వుత్తరం. మరోసారి చదివితే, జవాబు వ్రాయడానికి ఏదైనా తోస్తుందేమోనన్నట్లు, లోపలికెళ్ళి చప్పుడు కానివ్వకుండా బీరువా తెరచి ఆ కవరు తీసికొంది. మళ్ళీ వరండాలో ఉయ్యాల బల్ల మీద కూచుంది.

"ప్రియమైన రోహిణీ! అని ప్రారంభించడానికి కూడా నాకు సంకోచంగానే వుంది. ఎందుకంటే మా అందరికంటే ప్రియమైన వ్యక్తి, అని నువ్వు అనుకున్న నీ "భర్త" దగ్గరకు, సవతి కూతురు దగ్గరకు వెళ్ళేటప్పుడు మాట మాత్రమైనా చెప్పలేదు మాతోటి. 'వెడదామనుకుంటున్నాను,నీ సలహా ఏమిటి?' అని నన్ను నెలలనాడు అడగ్గానే, సిగ్గులేదా అని నిన్ను ఎదురు ప్రశ్న వేశాను. నువ్వు తలవంచుకున్నావు. సిగ్గు పడ్డావనే అనుకున్నాను.

శ్రీహరిగారు నిన్ను అగ్నిసాక్షిగా పెళ్ళాడి పదిహేనేళ్ళయిందటగా? మీ నాన్నగారి దగ్గర పదివేలు కట్నంగా పుచ్చుకొని, మరో పదివేలు తగలేయించి తన వారసులందరికీ సకల మర్యాదలు జరిపించుకుని నీ మెడలో ఒక తాడు కట్టాడట ఆయన. "హరి" కిష్టం లేదని ఇంటర్మీడియేటు చదువుని టక్కున ఆపేశావుట. ఏడాది తిరక్కుండానే "శ్రీ" వారు అమెరికా వెళ్ళడం, రాను రాను వుత్తరాలు సన్నగిల్లడం తిరిగి వచ్చి, గుట్టు చప్పుడు కాకుండా మదరాసులో కాపురం పెట్టడం జరిగాయని.. నువ్వు నాతో చెప్పుకుని ఎన్నో సార్లు ఏడ్చినప్పుడు నాకు తెలిశాయి.

ఇవన్నీ నువ్వు మర్చిపోయే వుంటావని గుర్తు చేస్తున్నాను రోహిణీ! ఆయన మీద కేసు పెట్టాలన్నా, కనీసం "విడాకులు" అనే మాట అనాలన్నా డబ్బు, పరువు పోతాయని మీ నాన్నగారి నమ్మకం. నువ్వు సరేసరి. అయోమయంగా నా ఖర్మ అనుకుంటూ, వారి ఫోటోను చూస్తూ కన్నీరు కారుస్తూ జీవితం గడిపేయాలనే పతివ్రతల పద్ధతిలో వున్నావు. ఆ సమాధిలోంచి నిన్ను బయటకు లాక్కొచ్చి, బి.ఏ. పూర్తి చేయించి, ఒక ఉద్యోగంలో పడేయడానికి నేను ఎన్ని ఏనుగుల బలం తెచ్చుకున్నానో తెలుసా! మీ అత్తమామల దగ్గరికి వెళ్ళి, ఏమిటీ ఘోరం అని అడుగుతానంటే, రభస అంటూ మీరెవ్వరూ పడనివ్వలేదు. పోనీలే దోసెడు రూపాయలు తెచ్చుకుని నీ అన్నం నువ్వు తింటున్నావని అనుకున్నాను. ఇంకా పట్టించుకోడానికి నా సమస్యలు నాకు కొన్ని ఏడిచాయగా? కన్నీళ్ళు కార్చావో, కష్టాలుపడ్డావో, అవమానాలే భరించావో ఆయనకు అసలు పట్టిందా?

రాత్రిళ్ళు నిద్ర మాత్ర మింగవద్దని చెప్పి చెప్పి మాన్పించడానికి ఎంత తిప్పలు పడ్డానో! అనువైన ఒక సంబంధం పట్టుకొస్తే "శివ శివా" అని నువ్వు చెవులు మూసుకోవడమే కాక, మీ అమ్మా నాన్న కూడా నానా మాటలూ అంటుంటే పేలవంగా నీవుండిపోతే, నేనెలా భరించానో! విడాకులు, మనోవర్తి అనే మాటలు వింటేనే మీ వాళ్ళు గజగజలాడిపోయారు. నిన్ను నేను కోర్టులోకి యీడుస్తున్నట్లు. నీ కన్నీటి కథ యిల్లా వుండగా అవతల ఆయనగారు ప్రమోషన్లు పుచ్చుకుని, కొత్త కార్లు కొనేసుకుని, ఝామ్మని కొత్త భార్యతో తిరిగేస్తున్నాడు.

పదేళ్ళు గడిచాక, పరాయి దేశస్థురాలు ఆమెకు ఎందుకో అలుక వచ్చి, తెగతెంపులు చేసుకుని పోయిన తర్వాత, ఆమె కన్నబిడ్డను సాకడానికి నిన్ను పిలిపించుకోవాలన్న గొప్ప ఔదార్యం వుంది నీ భర్తకు. రోహిణీ! పాత చెప్పుకన్నా, అరటి పండు తొక్కకన్నా హీనంగా, తేలికగా నిన్ను వదిలేసిన వాడు ఎందుకు నీ రాకకోసం తపించి పోతున్నట్లు పోజు పెట్టాడు? అర్థం చేసుకున్నావా? తనకి అవసరం కలిగింది. తనకి ఒక ఆడతోడు కావాలి. తన నౌకర్లపై అజమాయిషీ చేసి, యిల్లు నడిపేందుకు ఒక హౌస్ కీపర్ కావాలి. తన బిడ్డను పెంచే ఆయా కావాలి. అందుకే ప్రేమంతా ఒలకబోస్తూ వుత్తరాలు ఆ తర్వాత మీ సందులో పట్టనంత పెద్దటాక్సీలో మీ యింటి దగ్గర సాక్షాత్కారం. ఆ రోజున చచ్చిపోయిన వాళ్ళు తిరిగి బతికి వచ్చినట్టు సంబర పడి పోయారు మీరంతా!

ఆయన ఎంత స్వార్ధంతో పిలుస్తున్నాడో గ్రహించనే లేదు. పదిహేనేళ్ళు గుర్తుకు రాని "భార్య" యీనాడు నెత్తి మీద దేవతగా ఎలా స్ఫురించిందోనని ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు. వెయ్యి రూపాయల జీతం యిస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి, ఆ భర్తతో వుండి పోవడానికి వెళ్ళావు. ఆత్మ విశ్వాసంతో, స్వతంత్రంగా, వీరవనితలా బ్రతుకుతున్న దానివి ఎందుకు ఆ సెకండు హేండు మనిషి కోసం కక్కుర్తి పడ్డావో నాకు యిప్పటికీ బోధ పడడం లేదు.

పిచ్చిదానా! అతను నీ వాడు కాదు. ఆ బిడ్డ నీది కాదు. ఎండమావులను జూచి, చల్లని నీటి చెలమలనుకుని మతి పోగొట్టుకొన్నావు. నీ కోసం అనురాగ భాండం దాచి పెట్టాడని పొరబడ్డావు. తన ఇంట్లోని మోటారు కారు, టెలిఫోనులాంటి ఉపయోగకరమైన పరికరాలు ఎంతో నువ్వూ అంతే. నామాట విను. ఈ పాటికి నీకు అతని పన్నాగం అర్థమై వుంటుంది. ఇంకా ఆ వూబిలోకి దిగబడిపోకముందే బయటపడు. నీ రాజీనామా యింకా వీళ్ళు హెడ్డాఫీసుకి పంపకుండా జాగ్రత్త పడుతున్నాను.

నా కంటే నీ మేలు కోరిన వారు ఎవ్వరూ లేరు. ఒక భార్యని వదిలేశాడు. రెండో భార్యని తరిమేశాడు. ఇంకో మంచి ఆడది కనబడితే, నిన్ను పంపేస్తాడు తిరుగుటపాలో. ఈ వుత్తరం ఎవరి కంటా పడకుండా తెలివిగా తప్పుకుని వచ్చేయి. అతను కట్టిన పుస్తె యిన్నేళ్ళు మెళ్ళో వుంచుకున్నందుకు కనీస ధర్మంగా, తన అంత పెద్ద ఆస్తిలోంచి ఏమీ ముట్ట చెబుతాడో తేల్చుకో. చదువుకున్న అమ్మాయిలు కూడా యింత వెర్రి మొహాలా అని నలుగురూ నవ్వుకునేట్లుగా లొంగిపోకు రోహిణీ!"

ఉత్తరం చదువుతోంటే ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నట్లే వుంది. ఉత్తరం మడిచి, మొక్కల వంక చూస్తూ కూర్చుంది. స్వచ్ఛంగా, చల్లగా వీస్తున్న గాలికి విచ్చిన గులాబీలు, నవ్వుతూ తలలూపుతున్నట్లు వున్నాయి. పచ్చిక తడిసి,మరింత మెత్తగా పచ్చగా కనబడుతోంది. గేటు దగ్గర నిలబడ్డ ముసలి తాత, బర్రె పాలు తీయిస్తున్నాడు. నమ్మిన బంటులా తన ఆజ్ఞల కోసం వేచి వుంటాడు. తండ్రి పక్కన నిద్రపోతున్న శైలజ "అమ్మా" అని తనని పిలవడానికి యింక అట్టే వ్యవధి అవసరంలేదు. ఇవన్నీ ఎండమావులా అని చేతిలోని కవరు తడుముతూ ఆలోచిస్తోంది రోహిణి.

లోపల అలికిడి. అతను లేచినట్లున్నాడు. గబగబ వెళ్ళి ఉత్తరాన్ని బీరువాలో అదే చోటులో వుంచి, శ్రీహరికి కావలసినవేవో అందించాలనే ప్రయత్నంలో పడిపోయింది రోహిణి.

రోజులు గడుస్తున్నాయి. మళ్ళీ మాలతి ఉత్తరం "నేను అనుకున్నట్లే నువ్వు.. అక్కడే అయస్కాంతానికి అతుక్కుని పోయినావు. మన ఆడవాళ్ళకి మనస్సులోనే మూర్ఖత్వం మహా వృక్షంలా నాటుకుని పోయి వుంటుంది. ఇనుపగొలుసులా బానిసత్వం వంటిని కట్టిపడేస్తుంటుంది. నీ భర్తగారి రెండో "భార్య" ఒక్క తాపు తన్నేసి పోయిన ఆ బంగారు సింహాసనం నాకే గదా దొరికిందని మురిసిపోతున్నట్లున్నావు. ఆయన గొప్ప క్షమాపణలు చెప్పి బుడిబుడి ఏడుపులు ఏడిచి వుంటాడు. నిజమని నమ్మేస్తున్నావు. మొన్న మీ యింటికి వెళ్ళాను. అక్కడికి ఏమైనా ఉత్తరం వ్రాశావేమోనని. "ఇంత వడిబియ్యం పోసి, చలిమిడి పెట్టి రోహిణిని పంపించానమ్మా ! దాని కడుపు చల్లగా వుంటే అదే చాలు. ఇంక నేను ఏమైపోయినా ఫరవాలేదు" అంటూ కళ్ళు వత్తుకున్నారు. మీ అమ్మగారు. నాకు కడుపులో భగ్గున మండింది. "మీరంతా ఇంత తెలివి తక్కువ సత్తెకాలం మనుషుల్లా వుండబట్టే అతగాడు అలా ఆడించగలిగాడు. రమ్మంటే వచ్చి, పొమ్మంటే పోవడానికి యీనాడు పని మనుష్యులు కూడా వప్పుకోవటం లేదు. అభిమానం, పౌరుషం పట్టుదల మీలో లేవు కాబట్టి, రోహిణి కూడా వెయ్యిరూపాయల జీతం వదులుకుని జావలా జారిపోయింది" అన్నాను గట్టిగా.

"నిన్ను అడిగానని వ్రాసింది" అని చెప్పారావిడ. నన్ను తను అడిగేదేముటి? నేను అడిగిన వాటికి జవాబులు దొరక్క తనే తికమక పడుతుంటుంది అనుకున్నాను. మొగుడు వదిలేసిన మనిషి అని అందరూ అంటుంటే నువ్వు ఎంత ఏడిచావో మర్చిపోయావా రోహిణీ? నిన్ను అంత క్షోభకు, అవమానానికి, పన్నెండేళ్ళపాటు మనోవ్యధకు గురిచేశాడు ఆ మనిషి! ఎంత స్వార్థంతో నీ మీద అనురాగం నటిస్తున్నాడో గుర్తించు ఇప్పటికైనా. మనిషిగా నిలబడు. నీ జీవితంతో ఆడుకున్నందుకు ఒక గుణ పాఠం చెప్పి వచ్చేయి. నీ ఉద్యోగం నీకు స్థిరంగా వుంది. నువ్వు రాని ఐదారునెలలూ సెలవుగా యిస్తామన్నారు"

రోహిణి ఆ మధ్యాహ్నం ఉత్తరం వ్రాసి పడేసింది. "వచ్చే సోమవారం బయలు దేరి వస్తున్నాను. అమ్మకీ వ్రాస్తున్నాను లెటరు" అని.

తెల తెలవారుతుండగా రైలు దిగింది రోహిణి. స్టేషన్‌కి వచ్చేవారు ఎవరూ లేరని తెలుసును కాబట్టి, సామాను దింపించుకుని లెక్క పెట్టుకుంటోంది. ఇంతలో మాలతి వచ్చి భుజాలు పట్టి దగ్గరగా తీసుకోవడంతో ఉలిక్కి పడింది ఆమె.

"వచ్చేశావా? గుడ్ అల్లా వుండాలి తెగింపంటే. ఇంతేనా సామాను? పద పద మీ అమ్మ గుమ్మం దగ్గర నిలబడి వుంటారు పాపం" అన్నది మాలతి హడావిడిగా, రోహిణి చేతిలోని బుట్ట అందుకుంటూ పరీక్షగా చూస్తోంది స్నేహితురాలి వంక.

తనది తొందరపాటేమోనని ఆలోచించకుండా నిలబెట్టి, యిల్లా ప్రశ్నించవచ్చా అని సంకోచించకుండా అన్నది మాలతి. "మళ్ళీ వెళ్ళిపోవు కదా కొంపదీసి!" అని.

స్నేహితురాలి ముఖంలోకి చూడకుండా జవాబిచ్చింది రోహిణి. "వెళ్ళను" అని. రెండడుగులు

వేశాక, "ఆయన వస్తుండొచ్చు, నాలుగైదు నెలల తర్వాత" అన్నది మెల్లిగా. పోర్టరుతో బాటు పరుగెత్తబోయిన మాలతి టక్కున ఆగిపోయింది.

స్టేషను గోడమీద బొమ్మ "చిన్న సంసారం" మీద నుంచి చూపు త్రిప్పుకుంటున్న రోహిణి వేపు చూసి నిర్ఘాంత పోయింది మాలతి. ఆ చూపులో ఆదర్శానికీ, ఆచరణకీ వున్నంత దూరం వున్నది.

"పద మరి, అమ్మ చేసిన కాఫీ చల్లారి పోయి వుంటుంది" అన్నది రోహిణి, ముందుకు అడుగు వేస్తూ.